క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి

కామేపల్లి: కామేపల్లి గ్రామాభివృద్ధి చేయాలని కోరుతూ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కామేపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు శనివారం టేకులపల్లిలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. జీపీ పరిధిలో ఎక్కువగా నిరుపేదలే ఉండడంతో ఇందిరమ్మ ఇళ్లను అధికంగా మంజూరు చేయాలని, ఖమ్మం నుంచి గాదెపాడుకు ఇటీవల నిలిపివేసిన ఆర్టీసీ బస్ సర్వీస్‌ను పునరుద్ధరించాలని, కామేపల్లి జీపీని ప్రాజెక్టు జీపీగా పరిగణలోకి తీసుకోని నాలుగు పథకాలను అర్హులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అజ్మీరా రాందాస్‌నాయక్, అజ్మీరా అర్జున్‌నాయక్, బండి నరసింహారావు, భూక్యా సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

'వర్గీకరణకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది'

ఖమ్మంవన్‌టౌన్: ఎస్సీల ఏ,బీ,సీ,డీల వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య అన్నారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సండ్ర వెంకటవీరయ్యకు మాదిగ జాతి ఇప్పుడు గుర్తుకు వచ్చిందా అని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు బీఆర్‌ఎస్ నాయకులు కులం గురించి మాట్లాడుతున్నారన్నారు. చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌కు కట్టుబడి పార్టీ తప్పకుండా అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు కె.సుదర్శన్, నరేష్, రమేష్, రాకేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దివ్యాంగుల ఆర్థిక బలోపేతానికి కృషి

తిరుమలాయపాలెం: దివ్యాంగుల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందని ఎనేబుల్ ఇండియా సంస్థ ప్రతినిధి గద్దం రాంబాబు అన్నారు. శనివారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన దివ్యాంగుల స్వయం ఉపాధి శిక్షణపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు, మండల వికలాంగుల అధ్యక్షుడు వినోద్‌లు మాట్లాడగా.. ఎస్‌బీఐఆర్ సెటీ సీనియర్ ఫ్యాకల్టీ వహీద్ పాషా 35 మంది దివ్యాంగులకు ఎంపిక చేసి వ్యాపార అభివృద్ధి నైపుణ్యతపై శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేస్తామన్నారు. ఆర్‌డీఎస్ ప్రతినిధి ధరావత్ జానకి సాయి కిరణ్, ఎనేబుల్ కమిటీ ప్రతినిధులు సైదాబీ, మాధవి, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మంచికంటి హాల్‌లో బీవీకే-సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన శనివారం నెలనెలా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని నిమ్స్ ఆస్పత్రి మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ దాసరి ప్రసాద్‌రావు ప్రారంభించి 200 మందికి ఉచితంగా ఈసీజీ పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గుండె భద్రత కోసం వ్యాయామం చేయాలని సూచించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేరళ తరహాలో రాష్ట్రంలోనూ వైద్య పాలసీని అమలు చేయాలని కోరారు. అనంతరం వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కందుల రాధిక రాణి, చీకటి భారవి, పిల్లలమర్రి సుబ్బారావు, జి.రాజేష్, సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, బండి రమేష్, వై.శ్రీనివాసరావు, పి.ఝాన్సీ, పారుపల్లి అరుణ, సుబ్బారావు, అఫ్జల్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కామేపల్లి/తిరుమలాయపాలెం: భద్రాచలంలో ఈ నెల 4,5 తేదీల్లో జరిగే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకులు స్టాలిన్, పేరాల వెంకటేష్, తిమ్మిడి రఘు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టాలిన్ ప్రచారం నిర్వహించి మాట్లాడారు. అలాగే తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పోస్టర్లు ఆవిష్కరించిన సందర్భంగా వెంకటేష్, రఘు మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయడం లేదని, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు చనిపోతున్నా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జనరల్ కౌన్సిల్‌లో చర్చించి భవిష్యత్ ఉద్యమ రూపకల్పనలు చేసి, విద్యార్థి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో లక్ష్మణ్, వెంకటేష్, అశోక్, నిఖిల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం శివారు చినతండా, వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన పలువురి బాధితులకు ఎమ్మెల్సీ అలుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైన చెక్కులను సీపీఎం నాయకుడు నండ్ర ప్రసాద్ శనివారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న దుబ్బాక వెంకటరెడ్డికి రూ. 60వేలు, అంగోత్ రేణుకకు రూ.46 వేలు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునికీకరణ.. ఆలస్యం!

తుది దశకు చేరిన రైల్వే స్టేషన్ పనులు

- ఇప్పటికే ఓవర్ బ్రిడ్జి, విశ్రాంతి హాల్ నిర్మాణాలు పూర్తి
- మరో ఎస్కలేటర్ ఏర్పాటు
- పర్యవేక్షణ లేక పనుల్లో జాప్యం
- రూ.25.40 కోట్ల నిధులతో పనులు

ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. అయితే పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ పనులను పర్యవేక్షించే అధికారి లేకపోవడంతో ఇప్పటివరకు ఎన్ని పనులు ఎంత వరకు వచ్చాయో తెలియని పరిస్థితి ఉంది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఈ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుండగా.. స్టేషన్‌కు చేరుకోగానే ఎటునుంచి ఎటువెళ్లాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – ఖమ్మంరాపర్తినగర్


పూర్తయిన ప్రయాణికుల విశ్రాంతి హాల్

పూర్తయిన ఓవర్ బ్రిడ్జి, వెయిటింగ్ హాల్..

నూతనంగా ఏర్పాటు చేసిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం దాదాపు పూర్తయింది. బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఎస్కలేటర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాక ప్రయాణికులు సులువుగా వెళ్లేందుకు మెట్లకు బదులు ర్యాంప్‌ను సిద్ధం చేశారు. కాగా, దీని పనులు 70 శాతం పూర్తయిందని, త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అంతేకాక ప్రయాణికుల వెయిటింగ్ హాల్ నిర్మాణం పూర్తయింది. దాదాపు 50 మంది కూర్చునేలా సీట్లు ఉన్నాయి. ఆధునిక టాయిలెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

రూ.25.40 కోట్లతో అభివృద్ధి..

ఖమ్మం రైల్వేస్టేషన్‌కు 'ఏ'గ్రేడ్ స్థానంలో ఉన్న విషయం విధితమే. అయితే రైల్వేస్టేషన్లను ఆధునికీకరించేలా కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింది నిధులు మంజూరు చేసింది. ఈనేపథ్యాన ఖమ్మం రైల్వే స్టేషన్‌కు గత రెండేళ్ల క్రితం రూ.25.40 కోట్ల నిధులను రైల్వే శాఖ కేటాయించగా.. పనులు మాత్రం త్వరితగతిన జరగడంలేదని విమర్శలు వస్తున్నాయి. పనుల కారణంగా బారికేడ్లను ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు అసహనానికి గురవుతున్నారు. ఇప్పటికే ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డి ఆధునికీకరణ పనులను పర్యవేక్షించినప్పటికీ పనులు సజావుగా జరగడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

పనుల్లో జాప్యంతో ఇబ్బందులు..

రైల్వే స్టేషన్ బయట పనులు నత్తనడకగా జరుగుతున్నాయి. అంతేకాక రైల్వే అధికారులకు సంబంధించిన కార్యాలయ పనులు కూడా ఇంకా పూర్తి కాలేదు. టికెట్ బుకింగ్ కౌంటర్ చిన్నగా ఉండడంతో పాటు కౌంటర్ ఎదురు నుంచే ప్రయాణికులు ప్లాట్‌ఫాంకు చేరుకోవాల్సి మార్గం ఉంటుంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే దీన్ని ఇక్కడ నుంచి మార్చుతారో లేదో అధికారులు ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు.


ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేస్తున్న నూతన ఎస్కలేటర్



ఇరుకుగా ఉన్న టికెట్ బుకింగ్ కౌంటర్

ప్రయాణికుల అసహనం..

ప్లాట్‌ఫాం ఆధునికీకరణ పనులు మరింత ఆలస్యం అవుతున్నాయి. దీనిపై ఉన్న షెడ్డులను తొలగించారే కానీ మరలా నూతన షెడ్డును ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులు రైలు కోసం వేచి ఉండాల్సిన సమయాన ఎక్కడ నిలబడాలో తెలియక ఇంకా ఎన్ని రోజుల పనులు జరుగుతాయోనని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ఇబ్బందులను తొలగించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా కేవలం ఢిల్లీ, బిహార్ ఎన్నికలలో లబ్ధి పొందేలా ఉందని, తెలంగాణకు ఎలాంటి కేటాయింపులు లేకుండా తీవ్ర అన్యాయం చేసిందని, ఉత్పత్తి రంగాలను దెబ్బతీసేలా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు నున్నా నాగేశ్వరరావు, సీపీఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి విమర్శించారు. శనివారం కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన నగరంలోని సరితా క్లీనిక్ సెంటర్‌లో దిష్టిబొమ్మ దహనం చేసిన సందర్భంగా నున్నా, రఘునాథపాలెం మండలం జింకలతండా క్రాస్‌రోడ్డులో బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన చేపట్టిన సందర్భంగా నవీన్‌రెడ్డిలు మాట్లాడారు. ప్రభుత్వ రంగాలను పూర్తిగా నిర్వీర్యం చేసి, పేద ప్రజలపై తీవ్ర భారాలు మోపిందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అనేక ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు, యూనివర్సిటీ ఏర్పాటుకు, భద్రాచలం కొవ్వూరు రైల్వే లైన్‌కు, ప్రాజెక్టుల, పరిశ్రమల స్థాపనకు నిధులు కేటాయించలేదని, వెంటనే కేంద్ర బడ్జెట్‌ను సవరించాలన్నారు. సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యాన ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాగా, జింకలతండా నిరసన కార్యక్రమాన్ని సీఐ ఉస్మాన్‌షరీఫ్ నేతృత్వంలో అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాధినేని రమేష్, యర్రా శ్రీకాంత్, నాయకులు మెరుగు సత్యనారాయణ, ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, షేక్ మీరా, రమ్య, గుగులోత్ కుమార్, పటాన్ రహీం ఖాన్,షేక్.అబ్దుల్, మాజీ కో ఆప్షన్ ఎంపీటీసీ షేక్ ఇమామ్, వల్లూరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

'న్యూ ఇరా' 30 వసంతాల వేడుక



మంత్రి తుమ్మలకు జ్ఞాపిక అందజేస్తున్న యాజమాన్యం, ఇతరులు

ఖమ్మంసహకారనగర్: న్యూఇరా విద్యాసంస్థల 30 వసంతాల వేడుకను శనివారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ.. జాతి నిర్మాణం తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని, విలువలతో కూడిన విద్యను అందించడం న్యూఇరాకు మాత్రమే సాధ్యమని అభినందించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంతో ప్రారంభమై చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రాంగణమంతా హోరెత్తింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, ప్రముఖ కవి, ఫేమా కన్వీనర్ మువ్వ శ్రీనివాస్, ఎం.వీరారెడ్డి, టీపీడీఎంఏ అధ్యక్షుడు జి.కాంతారావు, ట్రస్మా అధ్యక్షుడు కె.నవీన్ బాబు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గప్రసాద్, పాఠశాల చైర్మన్ ఇంజం వెంకటరమణారావు, పాఠశాల డైరెక్టర్ భూమేశ్వరరావు పోతినేని తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన సంపత్తితో విద్యార్థులు రాణిస్తారు..



కాన్వర్జేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: అపార జ్ఞాన సంపత్తితో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని బేబీమూన్ పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్న పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో మాక్ కోర్టు, ఇంగ్లిష్ భాషా నైపుణ్యం పెంచేందించేందుకు నిర్వహించిన మెసేజ్ ఓరియెంటెడ్ కాన్వర్జేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో నేరాలు, ఘోరాలు పెరుగుతున్న నేపథ్యాన న్యాయ వ్యవస్థపై అవగాహన కోసం విద్యార్థులచే మాక్ కోర్టును నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కేసా భాస్కర్ మాట్లాడగా.. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో క్యాంపస్ డ్రైవ్

ఖమ్మంసహకారనగర్: ఆటో రంగంలోని జేబీఎం గ్రూప్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో తమ కళాశాలకు చెందిన 61 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో గ్రాడ్యుయేట్ ట్రెయినీ ఇంజనీర్ ఉద్యోగానికి ఎంపికయ్యారన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజ్‌కుమార్, సంస్థ హెచ్‌ఆర్ బి.ప్రేమనాథ్, అసిస్టెంట్ మేనేజర్ పురుషోత్తం, అకడమిక్ డైరెక్టర్లు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వడ్డెర సంక్షేమ సంఘం మండల కమిటీ ఎన్నిక

కామేపల్లి: అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం కామేపల్లి మండల నూతన కమిటీని శనివారం కొత్తలింగాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా రాయల వీరన్న, ప్రధాన కార్యదర్శిగా చల్లా శ్రీరామ్, ఉపాధ్యక్షుడిగా చల్లా వీరన్న, కోశాధికారిగా బత్తుల శ్రీను, సహాయ కార్యదర్శులుగా బండారు యల్లయ్య, దేవండ్ల నాగేశ్వరరావు, సూర్యనారాయణ, శివరాత్రి మల్లయ్య, ప్రచార కార్యదర్శిగా చల్లా రవి, కార్యవర్గ సభ్యులుగా చల్లా రమేష్, యూత్ మండల అధ్యక్షుడిగా బండి యల్లయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాయల రమణయ్య నూతన కమిటీ సభ్యులకు నియామక ప్రతాలను అందించి మాట్లాడారు. వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు ప్రత్యేక వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రమాణ స్వీకారం

ఖమ్మం మామిళ్లగూడెం: నగర పెయింటర్ల వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ బాధ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఖమ్మం సీక్వెల్ క్లబ్ సమీపాన ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ముదాం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కమిటీ గౌరవ అధ్యక్షుడిగా ఈ.వై.గిరి, అధ్యక్షుడు దాదె రామారావు, ప్రధాన కార్యదర్శి కార్లపాటి శ్రీనివాస్, కోశాధికారి యడ్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు పాకలపాటి శ్రీ రాము, సహాయ కార్యదర్శి గడదాసు గోపినాథ్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రతీ పెయింటర్‌కు ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, కార్మిక శాఖలోని పథకాల నిధులు విడుదల చేయాలని, 60ఏళ్లు దాటిన వారికి పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పావురాల నాగేశ్వరరావు, జంగం నగేష్, వీరబ్రహ్మం, పాలడుగు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

నేలకొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఓంప్రకాష్, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, తహసీల్దార్ జె.మానిక్‌రావ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు, వాటి పరిష్కారంపై స్థానికులతో చర్చించారు. వాటర్ ట్యాంక్‌లు ఎక్కి నీటి పరిశుభ్రతను పరిశీలించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యాన తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం తిరుమలాపురంతండాలో మంచినీటి కోసం గ్రామస్తులు ఆందోళన చేయడంతో వాటి పరిష్కారం కోసం వెళ్లి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఆయా పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

గుంటు మల్లన్న ఆలయ హుండీ ఆదాయం రూ.2.92 లక్షలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం త్రీటౌన్ ట్రంక్ రోడ్డులో ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. మూడు నెలల కాలానికి గాను రూ.2,92,055 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకులు ఈ.వెంకటేశ్వర్లు, ఆలయ ఈఓ చుండూరు రామకోటేశ్వరరావు, ముఖ్య అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ, తోటకూర వెంకటేశ్వర్లు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ఊరేగింపు

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెంలో చిట్టి ఆంజనేయస్వామి దేవాలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా శనివారం ఆంజనేయస్వామి విగ్రహాలు, ధ్వజ స్తంభాన్ని గ్రామస్తులు వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు జలబిందెలతో భారీ ప్రదర్శన చేపట్టారు. సాయంత్రం బలిహరణ కార్యక్రమం సందర్భంగా యువత కర్రలతో కాపాలా కాచారు. అర్చకులు ఇంగువ రామకృష్ణ, మాజీ సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తిరుపతమ్మతల్లి మాలధారుల పాదయాత్ర

కూసుమంచి: మండలంలోని గట్టుసింగారం నుంచి జీళ్లచెరువు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లి గోపయ్య స్వామి మాలధారులు శనివారం పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా గట్టుసింగారం గ్రామస్తులు సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలధారులు లగిశెట్టి వీరబాబు, ఎస్.వెంకట్రామయ్య, రంగ, తిరుపతయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచి: పాదయాత్ర చేపట్టిన మాలధారులు

మార్కండేయ స్వామిజయంతి ఉత్సవాలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం త్రీటౌన్ ప్రాంతంలో గల రంగనాయకుల గుట్టపై మార్కండేయ స్వామి జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి, ఖమ్మం జిల్లా గౌరవాధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు మాట్లాడుతూ.. మార్కండేయ స్వామి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని, వచ్చే ఏడాది వరకు స్వామివారి గుడి నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 34వ డివిజన్ కార్పొరేటర్ రుద్రగాని ఉపేందర్‌తో పాటు పెండెం జనార్దన్, బందారు శ్రీనివాసరావు, దుస్సా సత్యనారాయణ, పిల్లలు మరి కొండలరావు, సంపత్‌కుమార్, వీరభద్రం, రచ్చ శీను, గడ్డం సునీత , వింజమూరు సంధ్యారాణి, వెంకటేశ్వర్లు, పంతంగి అశోక్, భక్తులు పాల్గొన్నారు.

పండితాపురంలో నగర సంకీర్తన

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీతిరుపతమ్మతల్లి నగర సంకీర్తన, జ్యోతి కార్యక్రమాన్ని తిరుపతమ్మ తల్లి మాలధారులు శనివారం ఘనంగా నిర్వహించారు. పెనుగంచిప్రోలు తిరుపతమ్మతల్లి దేవాలయ ప్రధాన అర్చకుడు మర్రెబోయిన సూరిబాబు ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు చేయగా.. మాలధారులు అమ్మవారి పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ నగర సంకీర్తన చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మికత శోభ సంతరించుకుంది. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు.

కేఎంసీ సమాచారం..

డ్రెయినేజీలో మురుగు ఉండొద్దు..

ఖమ్మంమయూరిసెంటర్: డ్రెయినేజీల్లో మురుగు నీరు, వ్యర్థాలు నిల్వ ఉండకుండా చూడాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శనివారం నగరంలోని 20వ, 21వ డివిజన్లలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్లలో రోడ్ల వెంట వ్యర్థాలు తొలగించడం, డ్రెయినేజీల్లో మురుగును ఎత్తిచడం వంటి పనులు చేపట్టారు. కాగా, ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించిన డివిజన్లలో ఎక్కడ వ్యర్థాలు కనిపించినా చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

కొనసాగుతున్న పన్నుల వసూళ్లు..

కమర్షియల్ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, వార్డ్ ఆఫీసర్లు, ఇతర ఉద్యోగులు పన్నుల వసూళ్లను శనివారం కొనసాగించారు. ప్రతీ దుకాణానికి, ఇంటికి వెళ్లి ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజు, పంపు పన్నులను చెల్లించాలని కోరారు. ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేయించని షాపులను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. పన్నుల బకాయి ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేశారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్

'ఎల్ఆర్ఎస్' పరిశీలన వేగవంతం..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేసినట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 31వ తేదీలోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇక లేఅవుట్ కమిటీ మీటింగ్‌లో 23 వెంచర్లకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి 13 దరఖాస్తులకు అనుమతులు జారీ చేసినట్లు తెలిపారు.

ఆవిష్కరణలు..

బీఆర్ఎస్ క్యాలెండర్లు..

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యాన రూపొందించిన పార్టీ క్యాలెండర్లను ఎమ్మెల్సీ, పార్టీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్రం వెంకటవీరయ్యతో కలిసి శనివారం జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. పార్టీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య, కనగాల వెంకటప్పరావు, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, బలుసు మురళీకృష్ణ పాల్గొన్నారు.


బీఆర్ఎస్ క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్ తదితరులు

వాల్ పోస్టర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్షలాది డప్పులు, వేలాది గొంతుల భారీ సాంస్కృతిక, మహా డప్పు ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన వాల్‌పోస్టర్లను ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడగా.. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, తూరుగంటి అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వర్లు, గుండెపాక నరసయ్య, అశోక్, వంగూరి ఆనందరావు, చిలకా నాగరాజు, ఎంఎస్పీ ఖమ్మం నగర అధ్యక్షుడు తురుగంటి రాము, ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు బాకీ శ్రీను పాల్గొన్నారు.

దాతల ఔదార్యం..

ఆర్థిక సాయం

ఖమ్మం మామిళ్లగూడెం: కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన కొలికపోగు సోమయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా.. శనివారం ఆయన కుటుంబానికి జాంబవ వారసులం గ్రూపు ఆర్థిక చేయూత అందించింది. గ్రూపులో సభ్యుడిగా సోమయ్య ఉండడంతో గ్రూపు తరఫున రూ.75వేలను మృతుడి కుమార్తె శ్రీతపస్వి పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో తహసీల్దార్ కోట రవికుమార్ చేతులమీదుగా డిపాజిట్ పత్రాన్ని సోమయ్య కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో బొజ్జ గంగన్న, శ్రీను, కిన్నెర వెంకటేశ్వర్లు, తోటపల్లి జీవన్, కంచర్ల కర్నాకర్, కనకం సైదులు, మరికంటి కన్నారావు, కేదాస్ కృష్ణ, కోటేశ్వరరావు, ఆరెంపుల అంబేద్కర్, నెమలి కిషోర్, గురిజాల నరేష్, దాసరి చంద్రశేఖర్, పరిమల రాము, కోట జగదీష్, కాంపాటి ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.


డిపాజిట్ పత్రాన్ని అందిస్తున్న గ్రూపు సభ్యులు

పేద కుటుంబానికి బియ్యం..

కామేపల్లి: కామేపల్లి గ్రామ పరిధిలోని గోపాలపురం ఎస్సీ కాలనీకి చెందిన నీరుడు చంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. కామేపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ ఆధ్వర్యాన 75 కిలోల బియ్యాన్ని శనివారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు భూక్యా సీతారాములు, మాజీ సర్పంచ్ అజ్మీరా రాందాస్‌నాయక్, బండి నరసింహారావు, ఏనూటి శ్రీనివాస్, గండు సాగర్, కాలింగి చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు 'కథానిలయం'వార్షికోత్సవ సభ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఈస్తటిక్స్ ఆధ్వర్యాన ఆదివారం కథానిలయం 28వ వార్షికోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణ బాధ్యులు పి.రవిమారుత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో రెండు సెషన్లుగా నిర్వహించే ఈ కార్యక్రమంలో మొదటి సెషన్‌కు దాసరి అమరేంద్ర అధ్యక్షత వహించనుండగా ముఖ్య అతిథిగా ఘంటా చక్రపాణి పాల్గొంటారని వెల్లడించారు. ఈమేరకు దాసరి రామచంద్రరావు, పెద్దింటి అశోక్ కుమార్, పి.రవిమారుత్, సీతారాం, వినోదిని వివిధ అంశాలపై మాట్లాడతారని తెలిపారు. రెండో సెషన్‌లో నిమ్మగడ్డ శేషగిరిరావు, దాసరి అమరేంద్ర, ముళ్లపూడి సుబ్బారావు, తోట సుభాషిణి మాట్లాడనుండగా పుస్తకాల ఆవిష్కరణ, సమీక్షలు ఉంటాయని వెల్లడించారు. ఇందులో ప్రసేన్, కాశీపట్నపు సుబ్బారావు, వివనమూర్తి తదితరులు పాల్గొననుండగా విజయవంతం చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం..

రఘునాథపాలెం: మండలకేంద్రమైన రఘునాథపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ లైన్లు లాగుతున్న నేపథ్యాన నేడు(ఆదివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జె.శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు రఘునాథపాలెం వ్యవసాయ లైన్, పువ్వాడనగర్, శివాయిగూడెం, గ్రీన్ కాలనీ, జింకలతండా, కోయచలక తదితర గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు.